క్లుప్తంగా

సినిమా థియేటర్లలో తనిఖీ

అమలాపురం టౌన్: పట్టణంలోని పలు సినిమా థియేటర్లను తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్ తన సిబ్బందితో మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కొన్ని థియేటర్లలో మరుగు దొడ్ల నిర్వహణ సరిగా లేక అధ్వానంగా ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు. థియేటర్‌లో తినుబండారాలు విక్రయించే చోట ఏర్పాటు చేసిన ధరల పట్టిక (డిస్‌ప్లే బోర్డు)లో పేర్కొన్న ధరలకు, దుకాణదారుడు వసూలు చేసే ధరలకు వ్యత్యాసం ఉందని చెప్పారు. థియేటర్లలో మౌలిక సదుపాయాలు, తిను బండారాల ధరలు, మూత్ర శాలలను ఆయన తనిఖీ చేశారు. ఆయనతోపాటు వీఆర్వో శాంతకుమారి తనిఖీల్లో పాల్గొన్నారు.

ఉపాధి వేతన బకాయిలు విడుదల చేయాలి

అమలాపురం రూరల్: ఉపాధి హామీ కూలీలకు వేతనాలు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు వారాలుగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్న ఒక్కరోజు వేతనం కూడా ప్రభుత్వం చెల్లించలేదని దీంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఉపాధి బకాయిలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమలాపురం మండలం తాండవపల్లిలో మంగళవారం పర్యటించి ఉపాధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక నాయకులు దైవవాణి, అలేఖ్య పాల్గొన్నారు.

ఘర్షణలో ఓ వ్యక్తికి గాయాలు

యానాం: తన భార్యతో సన్నిహితంగా ఉంటున్న వ్యక్తిపై ఆమె భర్త దాడి చేశాడు. యానాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అగ్రహారంలో సోమవారం జరిగిన ఘర్షణలో ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకకు చెందిన జానా రాంబాబుకు గాయాలయ్యాయన్నారు. భార్యతో గొడవల నేపథ్యంలో అగ్రహారానికి చెందిన ఆమె భర్త ఎ.సత్యనారాయణ, వారి కుమారుడు దుర్గాప్రసాద్ వేరేచోట నివాసం ఉంటున్నారన్నారు. అయితే అగ్రహారంలో ఉంటున్న తన భార్య ఇంటికి జానా రాంబాబు, వికాస్ కాలనీకి చెందిన ఎల్ నగేష్‌తో కలిసి వచ్చారని సమాచారం తెలియడంతో తండ్రి, కొడుకులు వచ్చి వారిని నిలదీసారు. ఈ నేపథ్యంలో నలుగురి మధ్య పెనుగులాట జరగడంతో కూరగాయలు కోసే చాకును సత్యనారాయణ విసరడంతో జానా రాంబాబుకు తగిలి గాయపడినట్టు పోలీసులు తెలిపారు. రక్తపు గాయాలతో ఉన్న అతడిని యానాం జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పునీత్‌రాజ్ తెలిపారు.

ఐదు ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు

యానాం: ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ అనుబంధ సంస్థ అవే ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సరఫరా చేసిన లో-ఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులు మంగళవారం పుదుచ్చేరికి చేరుకున్నాయి. ప్రజారవాణా రంగం ఎలక్ట్రిక్ వాహనాలపై వైపు మళ్లించడాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నారు. మొదటి బ్యాచ్ ఐదు బస్సులు హైదరాబాద్ నుంచి పుదుచ్చేరికి చేరుకున్నాయి. మరో బస్సు ఈ వారంలో రానుందని అధికారులు తెలిపారు.

సీఎం సభా వేదిక స్థలం పరిశీలన

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 31న ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యం నిర్వహించే (పీ 4) బహిరంగ సభా వేదిక స్థలాన్ని మంగళవారం కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ టి.నిషాంతి పరిశీలించారు. చెయ్యేరులో ముఖ్యమంత్రి అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్తులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించే ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు, డ్వామా పీడీ మధుసూదనరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాము, పీఆర్ ఎస్‌ఈ రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వెంకటాచలం, తహసీల్దారు సునీల్ ఉన్నారు.

నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం గైర్హాజరుపై విమర్శలు

యానాం: న్యూఢిల్లీలో నిర్వహించిన నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశానికి సీఎం రంగసామి గైర్హాజరు కావడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి వెళ్లకుండా సీఎం రంగసామి పుదుచ్చేరి ప్రజలకు ద్రోహం చేసారని విమర్శించారు. నీతి ఆయోగ్ వేదికగా పుదుచ్చేరి ఎదుర్కొంటున్న అనేక సమస్యలను లేవనెత్తడానికి అవకాశం ఉండేదన్నారు. మాజీ సీఎం నారాయణసామి మాట్లాడుతూ సీఎం రంగసామి నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ బీజేపీ అధ్యక్షుడు సామినాథన్ నీతి ఆయోగ్‌కు రంగసామి గైర్హాజరవడంపై పుదుచ్చేరి డిమాండ్లను లేవనెత్తడానికి గల అవకాశాన్ని కోల్పోయారని పేర్కొన్నారు.

మహనీయురాలు రమాబాయి

అమలాపురం టౌన్: విద్యా, సామాజిక ఉద్యమాలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పాటు ఆయన భార్యగా రమాబాయి తన వంతు పాటుపడ్డారని అమలాపురం పట్టణం కొంకాపల్లి, భూపయ్య అగ్రహారం దళిత సేన అధ్యక్షుడు వాకపల్లి భీమేష్ అన్నారు. రమాబాయి భీమ్‌రావు అంబేడ్కర్ వర్ధంతిని దళిత సేన ఆధ్వర్యంలో కొంకాపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రమాబాయి దంపతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దళిత సేన ప్రతినిధులు డేవిడ్ అంబేడ్కర్, వాకపల్లి హరీష్ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- కొందరు పారిశుధ్య సిబ్బంది విధులకు గైర్హాజరు
- వేధిస్తున్న కార్మికుల కొరత
- ఫలితంగా వీధుల్లో పేరుకుపోతున్న చెత్త
- అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్ల ధ్వజం



పారిశుధ్య లోపాలపై, సిబ్బంది గైర్హాజరుపై సమావేశంలో ధ్వజమెత్తుతున్న పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగం పనిచేయడం లేదు. ఈ విభాగానికి చెందిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడం, కొందరు కార్మికులు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఇళ్ల వద్ద సేవలు చేయడంతో పట్టణంలో పారిశుధ్యం పడకేసిందని మున్సిపల్ కౌన్సిల్ పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం ఆద్యంతం పర్యవేక్షణా లోపంతో పారిశుధ్యం గాడి తప్పిన విషయంపై మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఇన్‌ఛార్జి కమిషనర్ బి.రాణి సంయుక్త, పారిశుధ్యాన్ని పర్యవేక్షించే 15 వార్డు సచివాలయాల కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో పారిశుధ్య కార్మికులు కనపించడంలేదని పలువురి కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ సమీక్షించాలి

పారిశుధ్య పనులను పర్యవేక్షించే ఇంజినీర్లు కౌన్సిలింగ్‌కు వెళ్లారని, వచ్చిన తర్వాత సమస్య తీవ్రతపై వారితో చర్చిస్తానన్న ఇన్‌చార్జి కమిషనర్ మాటలకు కౌన్సిలర్లు అడ్డుతగిలి అభ్యంతరం చెప్పారు. వార్డుల్లోకి పారిశుధ్య సిబ్బంది సక్రమంగా రావడం లేదని ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత అధికారులెవ్వరూ సమావేశానికి హాజరు కాని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, బండారు గోవిందు, దొమ్మేటి రాము, చిత్రపు రామకృష్ణ తదితరులు వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది పని తీరును ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి అధికారులను తన చాంబర్‌కు పిలిపించుకుని పారిశుధ్య సిబ్బంది పనితీరుపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు సూచించారు.

పార్కులో పారిశుధ్య లోపంపై ధ్వజం

చంద్రబాబు ఉద్యాన వనం (పార్కు) నిర్వహణను పారిశుధ్య సిబ్బంది అసలు పట్టించుకోవడంలేదని కౌన్సిలర్లు యేడిద శ్రీను, పిండి అమరావతి, బొర్రా వెంకటేశ్వరరావు, అబ్బిరెడ్డి చంటి, తిక్కా సత్య లక్ష్మి, గండి హారిక నిలదీశారు. పార్కులో డ్రెయినేజీ నిర్వహణ సక్రమంగా లేక ఓ బాలుడు అందులో ప్రమాదవశాత్తు పడి ప్రాణాలతో బయట పడ్డాడని వారు గుర్తు చేశారు. పార్కులో పలు ఆట వస్తువులు, బొమ్మలు తుప్పు పట్టడడం వల్లే ఇటీవల ఓ బాలుడి చేతికి గాయాలయ్యాయని చెప్పారు.

కార్మికుల గైర్హాజరును బయటపెట్టిన పర్యవేక్షణా సిబ్బంది

వార్డుల్లో ఎంత మంది కార్మికులు నియమించారు. ఎంతమంది హాజరవుతున్నారనే అంశంపై కౌన్సిలర్లు సమావేశంలో ఆరా తీశారు. 15 వార్డు సచివాలయాల పారిశుధ్య కార్యదర్శులతో పాటు ఆయా పార్కుల పర్యవేక్షకులపై కౌన్సిలర్లు ప్రశ్నలు వేశారు. పారిశుధ్య కార్యదర్శులు, పార్కుల పర్యవేక్షణ సిబ్బంది కౌన్సిలర్లు ప్రశ్నలకు బదులిచ్చారు. మరికొంత మంది డిప్యూటేషన్లపై వేరే విభాగాలకు వెళ్లి పనిచేస్తున్నారని చెప్పారు. కొంత మంది కార్మికులు తమ మాట వినడం లేదని పర్యవేక్షణా సిబ్బంది చెప్పడంపై కౌన్సిలర్లు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పనిచేయని కార్మికులకు మున్సిపాలిటీ జీతాలు ఇవ్వడం సరికాదని కౌన్సిలర్లు స్పష్టం చేశారు. వార్డులో పారిశుధ్య పర్యవేక్షణాధికారులు, పర్యవేక్షకులు తిరిగాల్సింది పోయి కౌన్సిలర్లు తిరుగుతున్నారని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరు కాని కార్మికులను గుర్తించి వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు సూచించారు. తాగునీటి సరఫరా విభాగం అధికారులపై కౌన్సిలర్లు పడాల శ్రీదేవి, సంసాని బులనాని, యేడిద శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు.

నైపుణ్య క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న మల్లాడి శామ్యూల్

యానాం: గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులను ప్రోత్సహించడానికి వారికి కావాల్సిన మౌలిక సౌకర్యాల ఏర్పాటు, ఆర్థిక సహకారం అందిస్తున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సేవలు అభినందనీయమని మాజీ మున్సిపల్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజును పురస్కరించుకుని మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఎమ్‌కేఆర్ ప్రీమియర్ లీగ్ వైట్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నీలో 18 జట్లు పోటీ పడుతున్నాయని విజేత జట్టుకు రూ.30వేలు, రన్నర్‌కు రూ.20 వేలు, తృతీయస్థానం సాధించిన జట్టుకు రూ.10వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, గుత్తుల జయరామారావు, రిటైర్డ్ సీఐ శివగణేష్, పంతగడ రమేష్‌నాయుడు, దుర్గబాబు, సుమన్, మల్లవరపు దయ, రంజీప్లేయర్ కాలాడి నాగూర్, చింతా అజయ్ పాల్గొన్నారు.

వెంకన్న దేవస్థానంలో యోగా శిక్షణ



శిక్షణ తరగతుల్లో యోగాసనాలు వేస్తున్న దేవస్థానం అధికారులు, అర్చకులు, సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు, అర్చకులు, సిబ్బందికి యోగా శిక్షణ ఇచ్చారు. యోగా గురువు దుర్గాప్రసాద్ వీరికి యోగాసానాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు స్థానిక వార్డు కౌన్సిలర్ గండి దేవి హారిక, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం యోగా గురువు దుర్గాప్రసాద్‌ను దేవస్థానం తరపున ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు పెద్దింటి లక్ష్మీ నరసింహాచార్యులు, గండి స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం



ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

ముమ్మిడివరం: రాబోయే వర్షాకాలంలో వార్డుల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని కోరితే కమిషనర్ లేఖ ఇవ్వాలని కోరడంపై ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ తీవ్రంగా మండిపడ్డారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో మంగళవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత 9 అంశాలతో కూడిన అజెండాను, 5 అంశాలతో కూడిన టేబుల్ అజెండాను ప్రవేశపెట్టి సమస్యపై చర్చించారు. అన్ని వార్డుల్లో శానిటేషన్ చర్యలు వేగవంతం చేయాలని సమావేశం దృష్టికి తీసుకురాగా లేఖ పూర్వకంగా ఇవ్వాలని కమిషనర్ కోరడంతో ఫ్లోర్‌లీడర్ బాలకృష్ణ కమిషనర్ తీరు సమంజసంగా లేదని అసహనం వ్యక్తం చేశారు. సభ్యులు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువస్తే లేఖ ఇవ్వమనడం సభ్యులను అవమానించడమేనని కమిషనర్ తీరు మార్చుకోవాలని అన్నారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కల్పించుకుని సభ్యులు తీసుకువచ్చిన సమస్యలకు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు సూచించారు. జాతీయ రహదారి వెంబడి తూరలు వేయకుండా లే అవుట్లు వేసిన యాజమానులపై తీసుకున్న చర్యలపై కమిషనర్ సమాధానం చెప్పాలని బాలకృష్ణ పట్టుబట్టారు. పట్టణ ప్రణాళిక అధికారులు పర్యవేక్షణ ఉండేలా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. 7వ వార్డు చప్పిడివారిపాలెంలో రూ.30లక్షలతో రోడ్డు పనులు ప్రారంభించేందుకు తాత్సారం చేస్తున్నారని కౌన్సిలర్ శ్రీనివాస్ సమావేశం దృష్టికి తీసుకువెళ్లారు. 13వ వార్డులో రెండు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదని శానిటేషన్ లేక ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారన్నారని కౌన్సిలర్ జయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. అమృత 2.0 పథకం ద్వారా మంజూరయ్యే రూ.14.50 కోట్లు నగర పంచాయతీ సాధారణ నిధులు నుంచి రూ.2.75 కోట్లు చెల్లించే విధంగా సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో నగర పంచాయతీ మేనేజర్, ఏఈ, సచివాలయం సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామానికి ట్యాంకర్ బహూకరణ



ఉప్పలగుప్తంలో వాటర్ ట్యాంకరును ప్రారంభిస్తున్న తహసీల్దార్ దివాకర్

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామంలో శివారు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి అవసరాలకు ఇబ్బంది పడకుండా గ్రామానికి చెందిన చిక్కం సాంబమూర్తి పాస్టర్ జ్ఞాపకార్థం వారి కుమారులు చిక్కం దానియేలు, చిక్కం ఇస్సాకులు ట్రక్కుతో కూడిన మంచినీటి వాటర్ ట్యాంకరును మంగళవారం గ్రామ పంచాయతీకి బహూకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీఎస్ దివాకర్ ముఖ్య అతిథిగా హాజరై ట్యాంకరును గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించి సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజుకు అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రాయానికి పాస్టర్ ఇస్సాకు, దానియేలు సోదరులిద్దరూ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సర్పంచ్ చిన్నవరాజు, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు పాస్టర్ ఇస్సాకును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రాజ్‌కుమార్, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, గ్రామ పెద్దలు చిక్కం దుర్గారావు, రవణం మధు, చిక్కం చోడేశ్వరరావు, ఆకుల రామకృష్ణ, సలాది సతీష్, నాగులపల్లి పాపయ్యరాజు, చీకట్ల కిషోర్, నల్లా శివాజీ, మోటూరి సత్యం కాపు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్ఎల్ఎన్ స్టేట్ కన్సల్టెంట్ బాలకృష్ణ

అల్లవరం: తరగతుల వారీగా విద్యార్థి అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తున్నట్టు ఎఫ్ఎల్ఎస్ స్టేట్ కన్సల్టెంట్ పి.బాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ఓడలరేవు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం డీఆర్పీల శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రాథమిక దశ నుంచి పునాది అభ్యసనం ఉండాలని, దీనికి ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఏ) ఉపకరిస్తుందని సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక భవన నిర్మాణానికి పునాది ఎంత అవసరమో, ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి విద్యార్థికి కూడా భాష, గణితంపై ప్రాథమిక భావనలతో కూడిన పునాది అవసరమన్నారు. విద్యార్థుల స్థాయి ఆధారంగా విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థుల అభ్యసనా స్థాయి పెరుగుతుందని, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఒకటవ తరగతి విద్యార్థి స్థాయికి అనుగుణంగా బోధన సాగాలన్నారు. రాష్ట్రంలో 33,225 మంది 1వ తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు మొదటి దశ శిక్షణ గత విద్యా సంవత్సరంలో పూర్తి చేశామన్నారు. ఈ ఏడాది రెండవ దశ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఒకటో తరగతి బోధన చేసే ఉపాధ్యాయుడు ఆ విద్యార్థి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తూ మార్గదర్శకత్వం చేయాలన్నారు. కార్యకక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వర్, తూర్పుగోదావరి జిల్లా ఏఎంఓ డి.గౌరీ శంకర్, సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి. రమేష్ బాబు, డాక్టర్ ఎం.కె భీమారావు, కె. నారాయణరావు పాల్గొన్నారు.

తీరం వెంబడి భద్రతా చర్యలు చేపట్టాలి



కలెక్టరేట్ వద్ద యోగా మాస్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: నదీ తీరం వెంబడి ఉన్న గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న రేవు పాయింట్ల వద్ద ప్రజల భద్రతకు పటిష్టమైన చర్యలు చేట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు మంగళవారం అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్, అధికారులను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ తీరం వెంబడి ప్రజలు విచ్చలవిడిగా నదిలోకి ప్రవేశించకుండా భద్రతా చర్యలను చేపట్టాలని సూచించారు.

31న సీఎం చంద్ర బాబునాయుడు పర్యటన

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 31వ తేదీ శనివారం ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో పర్యటించనున్నారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. సీఎం పర్యటనల బృంద సభ్యులు, జిల్లాస్థాయి అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన సమావేశమై పర్యటన ఏర్పాట్లపై ముందస్తుగా సమీక్షించారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ల స్థాపనకు కృషి చేయాలి

కోనసీమ ప్రాంత భౌగోళిక పరిస్థితులు పర్యావరణహితంగా అనుకూలమైన కొబ్బరి, క్వాయర్ విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ల స్థాపనకు ఉద్యాన పరిశ్ర మల అధికారులు ప్రత్యేక చొరవ చూపి ఆ దిశగా కొబ్బరి ఉత్పత్తుల ద్వారా జీవనోపాధి పెంపుదలకు పాటుపడాలని కలెక్టర్ సూచించారు ఐదు రోజులపాటు కర్ణాటక తమిళనాడు కేరళలో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలపై అధ్యయన చేసిన బృందం మంగళవారం పర్యటన అంశాలను కలెక్టర్‌కు వివరించారు. బృంద సభ్యులు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్, ఎల్‌డీ ఎం.కేశవ వర్మ, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ ఎ.రమణా రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జయచంద్ర గాంధీ, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ పాల్గొన్నారు.

యోగా మన వారసత్వ సంపద

యోగా మన వారసత్వ సంపదని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్ నుంచి నల్లవంతెన వరకు మాస్ ర్యాలీని జిల్లా స్థాయి అధికారులు, ప్రజలు, డ్వాక్రా సంఘాల సభ్యులు, ఉపాధి కూలీలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనం యోగాను ఆచరిస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షించారు.మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు, స్వచ్ఛంద సంస్థల యోగ గురువులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 8 వసతి గృహ పాఠశాలల్లో యోగ విద్యను అభ్యసిస్తున్న సుమారు 3,000 మందికి యోగ ఆనాపానం నేర్చుకునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటాన్నారు. డీఆర్‌ఓ రాజకుమారి, డీఈవో షేక్ సలీం బాషా, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి పీ. జ్యోతిలక్ష్మిదేవి. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, ఎల్డీఎం కేశవవర్మ, డ్వామా పీడీ మధుసూదన్ యోగా గురువులు పాల్గొన్నారు.

సురక్షిత పద్ధతుల్లో ఆక్వా సాగుతో లాభాలు

అమలాపురం టౌన్: సురక్షితమైన పద్ధతుల్లో ఆక్వా సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు, లాభాలు ఎలా సాధించాలనే అంశంపై క్రంప్ ఇంప్రూవ్‌మెంట్ సిస్టమ్స్ ఆధ్వర్యంలో స్థానిక అమలాపురం హైట్స్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కోనసీమకు చెందిన ఆక్వా రైతులు ఈ సదస్సులో పాల్గొని సురక్షిత సాగు పద్ధతులపై అవగాహన పెంచుకున్నారు. క్రంప్ ఇంప్రూవ్‌మెంట్ సిస్టమ్స్ ఇండియా కన్సల్టెంట్ లక్కరాజు సత్యనారాయణ్ పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. సంస్థ టెక్నికల్ హెడ్ నానసంగ్ హిందాల్తో, సంస్థ ప్రతినిధి శివప్రసాద్, ఫామ్ డేటా ఎనలిస్ట్ డాక్టర్ రిషి తదితరులు రైతులకు ఆక్వా సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

విద్యా మిత్ర స్టూడెంట్ కిట్ల పరిశీలన

అల్లవరం: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర స్టూడెంట్ కిట్ల స్థానిక స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.మమ్మీ మంగళవారం తనిఖీ చేశారు. బెల్టుల సైజులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బడులు తెరిచే సమయానికి సకాలంలో కిట్లు అన్నీ పాఠశాలకు చేరాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంవో బి.వి.సుబ్రహ్మణ్యం, ఎమ్ఈవో కె.కిరణ్ బాబు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

తాళ్లరేవు: మండల పరిధిలోని నీలపల్లిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు స్థానిక జగనన్న కాలనీలో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడిచేసి ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,010 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉన్నత విద్య ఫీజుల కమిటీ సమావేశమవ్వాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్నతవిద్యకు సంబంధించి ప్రభుత్వం నియమించిన ఫీజుల నిర్ణాయక కమిటీని తక్షణం సమావేశ పర్చాలని మంగళవారం సెంటాక్ స్టూడెంట్స్ అండ్ పేరెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్ నారాయణసామి ఎల్జీ కైలాషనాథన్, సీఎం రంగసామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యా కోర్సులకు ఫీజులు నిర్ణయించడానికి రిటైర్డ్ జడ్జి కన్నమ్మాల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం కమిటీని నియమించిందన్నారు. 2025–26 విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు ఫీజుల నిర్ధారణ కమిటీ సమావేశం నిర్వహించలేదని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అధిక ట్యూషన్ ఫీజు వసూలు చేసే ప్రైవేట్ కళాశాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటి స్థలాన్ని ఆక్రమించిన వారిని శిక్షించాలి

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కొత్తపాలెంనకు చెందిన కాలాడి అచ్చిబాబు వర్గం, మొల్లేటిమొగకు చెందిన కాలాడి సూరిబాబు కుటుంబంపై దాడి చేసి తాటాకు ఇంటిని పూర్తిగా తొలగించి ఉప్పుటేరులో పడవేసి తెల్లవారేసరికి ఆ స్థలంలో రేకుల షెడ్డు వేసారు. పల్లం కుర్రు పంచాయతీ మొల్లేటిమొగకు చెందిన కాలాడి సూరిబాబు పూర్వీకుల నుంచి వచ్చిన స్థలంలో తాటాకు ఇల్లు నిర్మించుకుని భార్య రామలక్ష్మి, ఇద్దరు అమ్మాయిలతో కలసి నివాసం ఉంటున్నారు. ఈ స్థల వివాదంపై కోర్టులో కేసు నడుస్తోందని, అచ్చిబాబు వర్గం సుమారు 20 మంది సోమవారం రాత్రి వచ్చి దాడి చేశారని సూరిబాబు తెలిపారు. తన భార్య రామలక్ష్మి, పిల్లలపై దాడి చేసి తాటాకు ఇంటిని తొలగించారని తెలిపారు. మొల్లేటి మొగకు చెందిన గ్రామ పెద్దలు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దాడిలో గాయపడిన కాలాడి సూరిబాబు కుటుంబ సభ్యులు ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులకు, గ్రీవెన్సుకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇంటి స్థలాన్ని ఆక్రమించి రేకుల షెడ్డు వేశారని బాధిత కుటుంబం వాపోయారు. రేకుల షెడ్డును తొలగించి, దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని రామలక్ష్మి కోరారు. సంబంధిత అధికారులు న్యాయం చేయకుంటే చెయ్యేరు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకు వెళతామని తెలిపారు. దీనిపై ఎస్సై అవినాష్ మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి



నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని మంగళవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బైపాస్ రహదారిలో నెహ్రూ నిలువెత్తు కాంస్య విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి, సీఐ అడలరసన్ తదితరులు పూలమాల లువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు, పీఆర్ఏ కొల్లు ప్రసాద్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బాపనయ్యనాయుడు విగ్రహానికి నివాళులు

ఫ్రెంచి వారి హయాంలో యానాం పట్టణ మేయర్‌గా సేవలందించిన బెజవాడ బాపనయ్యనాయుడు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమలాపురంలో..

అమలాపురం టౌన్: భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమం అమలాపురం పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూ వీధిలోని జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వస్కా బాబు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను గుర్తించేందుకు సర్వే



అమలాపురం కామాక్షీ పీఠంలో ప్రేమ మందిరాన్ని సందర్శించిన 'సాథి' కమిటీ ప్రతినిధి బృందం

అమలాపురం టౌన్: పట్టణంలో పలు ప్రాంతాల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అనాథ పిల్లలు, వీధి పిల్లల కోసం సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సిస్ టూ ట్రాకింగ్ హోలిస్టిక్ ఇన్‌క్లూషన్ (సాథి) ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. ఇందు కోసం సాథి కమిటీ ప్రతినిధుల బృందం స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో అనాథ పిల్లలు పెరిగే ప్రేమ మందిరం, హరి మనో వికాస కేంద్రాలతోపాటు ఆ పరిసర ప్రాంతాల్లో సర్వే నిర్వహించింది. అనాథ పిల్లలు, వీధి పిల్లలు, ఎవరి ఆదరణ లేని పిల్లలపై కమిటీ ప్రతినిధుల బృందం ఆరా తీసింది. జిల్లా శిశు రక్షణ శాఖ నుంచి లక్ష్మణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఏలేశ్వరరావు, జిల్లా విద్యా శాఖ నుంచి డాక్టర్ ఎంఏకే భీమారావు, ఏపీవో పీఎల్‌వీ ఆనందర్, ప్యానల్ న్యాయవాది వీకేఎస్ భాస్కరశాస్త్రి కమిటి ప్రతినిధులుగా ఈ సర్వే నిర్వహించారు. అనాథ పిల్లలు, వీధి పిల్లలకు ఆధార్ కార్డు లేకపోతే ఆ కార్డు వారికి వచ్చేలా ఆధార పత్రాలన్నీ కమిటీ ప్రతినిధులు సేకరించారు. 18 ఏళ్లు నిండిన వ్యక్తులను గుర్తించి వారికి ఆధార్ నమోదు ప్రక్రియ ప్రారంభించారు. అలాంటి పిల్లలకు విద్య, ఆరోగ్య సంరక్షణ, శిశు రక్షణ వంటి అంశాలపై చర్యలు చేపట్టారు. ఆధార్ కార్డు లేని పిల్లల సమాచారాన్ని కమిటీ దృష్టికి తీసుకుని వస్తే ఆ ప్రక్రియ పూర్తి చేస్తామని కమిటీ ప్రతినిధి భాస్కరశాస్త్రి తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, అనాథ పిల్లలు పెరిగే కేంద్రాలు, గృహాలను కమిటీ ప్రతినిధి బృందం సందర్శించి సర్వే చేస్తారని తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఏఎస్సై జమిందార్ తదితరుల పాల్గొన్నారు.